ఏపీ పొదుపు సంఘాలు దేశానికే ఆదర్శం

- 1079 సంఘాల సభ్యుల ఖాతాలకు రూ.9.48 కోట్ల నగదు జమ
- మూడవ విడత చెక్కు అందజేసిన పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్



పామర్రులో డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గుడివాడలో చెక్కులు పంపిణీ చేస్తున్న అధికారులు

పామర్రు: రాష్ట్రంలోని పొదుపు సంఘాలు దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పామర్రు శాసనసభ్యుడు కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పొదుపు సంఘాల సభ్యులు వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కును సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేసి వారికి అందిస్తోందని అన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు చేసిన మోసంతో అనేక డ్వాక్రా సంఘాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. వీటిని సరిదిద్ది గాడిలో పెట్టేందుకు సీఎం జగన్ వేల కోట్లు నిధులు కేటాయిస్తూ పొదుపు సంఘాలను అభివృద్ధి బాటలో పయనింప చేస్తున్నారని అన్నారు. మహిళలు అందరూ జగనన్నకు అండగా ఉండగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి మండలంలోని డ్వాక్రా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా మూడవ విడతగా అందించిన రూ.9,48,80,244 నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. వీరంతా కృతజ్ఞతాపూర్వకంగా ముఖ్యమంత్రి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎ.రమాదేవి, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, తలారి మహేష్, నాగ మల్లేశ్వరరావు,గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి, ఉప సర్పంచ్ డి బాల వెంకటేశ్వరరెడ్డి, మహిళా సమాఖ్యా అధ్యక్షురాలు ధనాల కృపావతి, పార్టీ నాయకులు కూసం పెద వెంకటరెడ్డి, మున్నంగి సత్తిరెడ్డి, బి.సురేష్‌రెడ్డి, ఐకేపీ ఏపీ సుందరరావు, ఏపీఎం తిరుపతయ్య, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం – మెప్మా పీడీ పి.శివరామ ప్రసాద్

గుడివాడటౌన్: రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలనేదే ప్రభుత్వ లక్ష్యం అని డీఆర్‌డీఏ, మెప్మా పీడీ పి.శివరామ ప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చే క్రమంలో భాగంగా మూడవ విడత పురపాలక సంఘ పరిధిలోని 1,365 స్వయం పోషక సంఘాలకు రూ.13 కోట్ల 9 లక్షలు ఇచ్చామన్నారు. ఈ మొత్తాలను పొదుపు సంఘాలు సంయుక్తంగా ఏదైనా ఒక కార్యక్రమంలో పెట్టుబడిగా పెట్టి తద్వారా ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని ఒక్కొక్క గ్రూపునకు రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు రుణాలు ఇవ్వడానికి వారు అంగీకారం తెలిపారన్నారు. ఈ విధంగా మహిళలు స్వయంశక్తి ద్వారా ఆర్థికంగా ఎదిగి స్థిరపడాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆశయమన్నారు. మహిళలు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని ఇతర ఖర్చులకు వినియోగించకుండా ఆర్థిక ఎదుగుదలకు వినియోగించాలని ఆయన సూచించారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, కృష్ణమోహన్, సమాఖ్య అధ్యక్షురాలు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహరావు, మెప్మా సీఎంఎం శ్రీధర్, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, ఆర్పీలు, సీఓలు పాల్గొన్నారు.

రేపు ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ

గుడివాడటౌన్ (నందివాడ): నందివాడ మండలం డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమం ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని కొండపల్లి కన్వెన్షన్ హాలులో మధ్యాహ్నం రెండు గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. నందివాడ మండలంలోని 790 గ్రూపుల సభ్యులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఏఐసీసీ సభ్యులు

గుడివాడటౌన్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు ఎంతో మేలు చేస్తుందని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) అధ్యక్షుడు ఎల్.జాన్‌బెన్నీ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో సోమవారం కౌన్సిల్ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న అసెంబ్లీలో రాజ్యాంగం దళితులకు కల్పించిన అన్ని సౌకర్యాలు దళిత క్రైస్తవులకు కూడా చెందేలా తీర్మానం చెయ్యడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.జయరాజు, సభ్యులు ఎల్.శేఖర్‌బాబు, కె.జయరాజు, ఎం.రాజు, ప్రభాకర్, రాంబాబు, వెంపటి సైమన్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో...

దళిత క్రైస్తవుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చూపిన చొరవ అభినందనీయం అని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ జి.శ్యామ్‌బాబు అన్నారు. స్థానిక పంచవటి కాలనీలోని పెంతెకోస్తు దేవాలయంలో పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం జరిగింది. దళిత క్రైస్తవులను ఎస్సీ కులాల జాబితాలో చేర్చాలంటూ అసెంబ్లీ తీర్మానం చేయించిన జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని అన్ని క్రైస్తవ సంఘాల సభ్యులు రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఫెలోషిప్ రాష్ట్ర కార్యదర్శి పి.కరుణ కుమార్, కో-ఆర్డినేటర్ పాస్టర్ మందా సువర్ణ బాబు, పాస్టర్‌లు ఎలీషా, పాస్టర్ యెహెజ్కేలు, ప్రసన్నకుమార్, సమూయేలు, డాక్టర్ యదీద్యా తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ రహదారి అభివృద్ధి చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశం
- బోయినవారిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



బోయినవారిపాలెంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పసుమర్రు(పామర్రు): ఆర్ అండ్‌బీ రహదారిని అభివృద్ధిపర్చాలని స్థానికులు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌ను కోరగా సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పామర్రు మండలం పసుమర్రు గ్రామ శివారు బోయినవారిపాలెంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను తెలుసుకుని అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నారు. గత మూడున్నర ఏళ్ల ప్రభుత్వ పాలనలో గ్రామంలో ప్రజలకు ప్రభుత పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలుపుతూ, ప్రతి ఇంటిలో ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారులైన వారికి పథకాల లబ్ధి పొందిన కరపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సర్వతో ముఖాభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పాలన అందిస్తోందని అన్నారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను పక్క రాష్ట్రాల వారు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు టి.శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, పార్టీ నాయకులు పెయ్యల రాజు, బి.అప్పిరెడ్డి, ఎ.శ్రీహరి, కొణతం శ్రీనివాసరావు, శామియ్యేలు, జురువరపు చిన్ని, వెంకటేశ్వరరావు, జె.జ్యోతి, గ్రామ కార్యదర్శి పద్మశ్రీ వేణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- యానాదుల గృహ నిర్మాణాలకు అదనంగా రూ.22.32 లక్షలు
- చెక్కులు అందజేసిన పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



లబ్ధిదారులైన యానాదులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): షెడ్యూల్ తరగతులకు చెందిన వారు అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలని, తద్వారా సమాజంలో అసమానతలు లేకుండా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం గురజాడ గ్రామంలోని యానాదుల కుటుంబాల వారికి గృహ నిర్మాణానికి ఆర్థిక భరోసా చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గ్రామానికివచ్చిన జిల్లా కలెక్టర్ గ్రామంలో రోడ్డు పక్కన చిన్న చిన్న గుడిసెల్లో నివసిస్తూ ఇక్కడ జీవిస్తున్న యానాదుల కుటుంబ సభ్యులతో మమేకమై వారి కష్టాలను వారు పడుతున్న బాధలను అడిగి తెలుసుకున్నారన్నారు. అనంతరం ఇక్కడ నివసిస్తున్న యానాదుల కుటుంబాల వారికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.1.80 లక్షలను మంజూరు చేశారని చెప్పారు. ఆర్థిక స్తోమత లేని కారణంగా వారు ఈ నగదుతో గృహాలను నిర్మించుకోలేమని మరింత నగదు చెల్లిస్తే గృహ నిర్మాణాలు చేసుకుని జీవిస్తామని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై స్పందించిన ప్రభుత్వం గిరిజన సంక్షేమ సంఘం ద్వారా 36 మంది యానాది కుటుంబాల వారికి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు ఒక్కొక్కరికి అదనంగా రూ.62 వేల చొప్పున మొత్తం రూ.22.32 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. మంజూరైన రూ.62 వేలలో తొలి విడతగా ఒక్కొక్క కుటుంబానికి రూ.20వేల చొప్పున రూ.7.20 లక్షలను అందజేశామన్నారు. మిగిలిన నగదుని కూడా విడతల వారీగా వారికి అందజేసి గృహనిర్మాణాలు సత్వరమే పూర్తి అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గృహనిర్మాణదారులకు ఇసుకను తన వంతుగా సరఫరా చేస్తానన్నారు. జగనన్న కాలనీలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులైన విద్యుత్, తాగునీరు, రహదారులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంపాన వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ ఏనుగ వెంకట రమణకుమారి, ఎంపీపీ కాసాని వేదసుప్రజ, ఎంపీటీసీ మల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, ఉప సర్పంచ్ షుకుర్ ఖాన్, సచివాలయ కన్వీనర్ వెంకట కృష్ణ ప్రసాద్, పైడిపాముల మొజేష్, రజియా బేగం, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో సుధా ప్రవీణ్, పార్టీ నాయకులు ఏనుగు మస్తాన్‌రావు, రాజులపాటి గురవయ్య, గ్రామ కార్యదర్శి టీవీ రమణ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సమస్యలు దూరం



పోతుమర్రు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు(కలిదిండి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో సమస్యలు దూరమవుతాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పోతుమర్రు శివారు గొల్లగూడెం, పరమానందునిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రస్తావించగా, ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం ఐనంపూడి గ్రామంలో శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ భూమిపూజ చేశారు. గ్రామంలో సుమారు రూ.90 లక్షల అంచనాతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి శేష వస్త్రాలతో ఎమ్మెల్యేను సత్కరించి ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శొంఠి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ బేబి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు స్పోర్ట్స్ కిట్ అందజేత




మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995వ సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఉప్పలపాటి సుధీర్ ఇచ్చిన రూ.20 వేల సాయంతో స్పోర్ట్స్ కిట్‌ను సర్పంచ్ మెండా ఝాన్సీ అదే బ్యాచ్‌కి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్ చేతులమీదుగా సోమవారం స్కూల్‌కు అందజేశారు. చదువుతో పాటు విద్యార్థులకు ఆటలు, పాటలు అవసరమని స్పోర్ట్స్ కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు, గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల్లో నైతిక విలువలు పెంచాలి



గుడివాడటౌన్: ప్రతి ఒక్కరూ తమ పిల్లల విద్య పట్ల చూపుతున్న శ్రద్ధను నైతిక విలువలు పెంపొందించేందుకు కూడా చూపాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి వినయ్ కుమార్ అన్నారు. స్థానిక టీచర్స్ కాలనీలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలలో నైతిక విలువలు పెంపొందింపజేయడం కూడా ఒక సమాజసేవ వంటిదేనన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుత్తా రమేష్, అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, డైరెక్టర్‌లు గంటా చంద్రశేఖర్, దండమూడి సీతారామ స్వామి, చైర్మన్ వేణుగోపాలరావు, కార్యదర్శి సరస్వతి, కె.సుభాష్ చంద్రబోస్, జయలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

శ్మశానవాటిక ఆక్రమణపై గ్రామస్తుల ఆగ్రహం



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు వద్ద కరకట్ట వెంబడి శ్మశానవాటిక ఆక్రమణపై గ్రామస్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గడచిన వందేళ్లకు పైగా తమ అధీనంలో ఉన్న శ్మశానవాటికను ఓ మట్టి వ్యాపారి ఆక్రమించుకుని, ఇటుక బట్టీ ఏర్పాటు చేశాడని ఆరోపిస్తున్నారు. స్థానిక కృష్ణా కరకట్ట వెంబడి సగర కులస్తులకు సుమారు తొంభై సెంట్ల విస్తీర్ణంలో శ్మశానవాటిక ఉంది. దీనిలో కొంత భాగాన్ని సమీప పొలాల రైతులు గతంలో ఆక్రమించుకున్నారు. తాజాగా ఓ మట్టి వ్యాపారి శ్మశానవాటికను ఆనుకుని ఉన్న పొలాన్ని కొనుగోలు చేసి, శ్మశానవాటికను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడని సగర కులస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరిగా స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దృష్టికి తీసుకువెళతామని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సగర సంఘం నాయకులు నక్కా అంజియ్య, బాబి, వెంకట్రావు, శంకర్, ప్రసాద్ పేర్కొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 102 రోజులకు రూ.14,42,782 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ నేల సంధ్య, చైర్మన్ శొంఠి నాగరాజు తెలిపారు. రెండు గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి వచ్చినట్లు చెప్పారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో హుండీల ఆదాయాన్ని పాలకమండలి సభ్యులు ఆనంద దాసు శివనాగేంద్ర, చలపాగ శ్రీనివాసరావు, చీదెళ్ళ సారధ, వివిధ ఆలయాల మేనేజర్లు లెక్కించారు.

సంక్షిప్త వార్తలు

జగనన్న కాలనీలో శరవేగంగా నిర్మాణాలు

మండవల్లి: మండలంలోని భైరవపట్నం జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. నాలుగు ఎకరాల 40 సెంట్ల స్థలంలో 186 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీరికి గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయం అందజేయడంతో శరవేగంగా నిర్మాణ పనులు చేస్తున్నారు. రూ.1.80 లక్షలు ఇచ్చారు. ఇసుక ఉచితంగా అందించారు. సిమెంట్, మెటల్ సబ్సిడీ ధరకు అందిస్తున్నారు. 176 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు 48 ఇళ్ల శ్లాబ్‌లు వేసి పూర్తి చేశారు. 79 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. తొమ్మిది రూఫ్ లెవెల్‌లో ఉన్నాయి. మిగిలిన లబ్ధిదారులు బరంతు తోలుకుని నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు.

సామూహిక సీమంతాలు

మండవల్లి: పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చింతపాడు సెక్టార్ పరిధిలోని తక్కెళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఆనంద బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసిందని, గర్భిణులు, బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తోందని చెప్పారు.

పోషకాహారంతో ఆరోగ్యకర జీవనం

కైకలూరు: పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చక్కటి ఆరోగ్యం సొంతమవుతుందని కైకలూరు ఐసీడీఎస్ ప్రాజక్టు సీడీపీఓ బి.ఆనందకుమార్ చెప్పారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వెలంపేట 15వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో తృణ ధాన్యాలపై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుక్కల్యాణ మహోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండ రామస్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించి రాత్రి విష్వక్సేన పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు, పల్లకీ వాహనంలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 29న అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 30న మధ్యాహ్నం స్వామివారి తిరుక్కల్యాణం, 31న స్వామివారి రథోత్సవం, ఏప్రిల్ 1న పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 30న భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. పూజా కార్యక్రమాలు ఆసూరి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

పిల్లలందర్నీ బడికి రప్పించాలి

ముదినేపల్లిరూరల్: బడి ఈడుగల పిల్లలు బడి బయట ఉండకుండా పాఠశాలలకు విధిగా రప్పించాలని సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ రాధాకృష్ణ అన్నారు. మండలంలోని వడాలి జెడ్పీహైస్కూల్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలకు రప్పించేందుకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు, సీఆర్పీ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఒక సామాజిక వేత్త కమిటీలో సభ్యులుగా ఉండాలని, వీరంతా బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలకు రప్పించాలన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలల రూపురేఖలు మార్చిన సీఎం జగన్

కైకలూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన స్ఫూర్తిదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొడ్డు నోబుల్ అన్నారు. దొడ్డిపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమైన పెన్నులు, ప్యాడ్‌లను సోమవారం ఆయన ఉచితంగా అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రతి ఒక్కరికీ రూ.3000 చొప్పున నగదు బహుమతి అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

వాహనాల వేలం ద్వారా రూ.3.36 లక్షలు

గుడివాడటౌన్: గుడివాడ రవాణా శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన వాహనాల బహిరంగ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.3,36,700 ఆదాయంతో పాటు జీఎస్టీ రూపంలో రూ.63,900 ఆదాయం చేకూరినట్లు ఆర్టీఓ విజయసారథి సోమవారం తెలిపారు. స్థానిక డ్రైవింగ్ ట్రాక్ వద్ద వివిధ కారణాలతో సీజ్ చేసిన వాహనాలకు బహిరంగవేలం జరిపినట్లు ఆయన తెలిపారు. మొత్తం 23 వాహనాలను వేలం వేయగా మొత్తం రూ.4,00,600 ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ శ్రీనివాస్, మోటారు వాహన తనిఖీ అధికారులు శ్రీనివాస్, సంగీతరావు, సిబ్బంది ప్రదీప్, కిషోర్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ పాలక మండలి ఎన్నికలు

మొవ్వ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మొవ్వ యూనిట్ ఎన్నికలు సోమవారం మొవ్వ గ్రామంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. మొవ్వ యూనిట్(మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల) అధ్యక్షులుగా వీవీ కృష్ణారావు, కార్యదర్శిగా పి.సీతారామాచార్యులు, కోశాధికారిగా వేదాంతం రాఘురామ శర్మ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కోసూరు ఆదినారాయణ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని మొవ్వ ఉపఖజానా అధికారి తాతినేని శ్రీనివాసరావు అభినందించారు.

రాములోరు పెండ్లి కుమారుడాయనే!

కై కలూరు(కలిదిండి): అపర భద్రాదిగా పేరు గడించిన కలిదిండి మండలం తాడినాడ సీతారామస్వామి దేవస్థానంలో అధ్యాయన కల్యాణోత్సవాల్లో భాగంగా సీతారాములను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెగా అర్చకులు సోమవారం అలంకరించారు. ఈ నెల 30న మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

ఎమ్మెల్యే కైలే నేడు తోట్లవల్లూరు రాక

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ మంగళవారం మండల కేంద్రమైన తోట్లవల్లూరుకు విచ్చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలియజేశారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక కనకదుర్గమ్మ కాలనీ సమీపంలో మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

పెదపారుపూడి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తే బిల్లులు వెంటనే మంజూరు చేసేలా కృషి చేస్తామని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణ పనులపై లబ్ధిదారులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. వెంట్రప్రగడ గ్రామానికి చెందిన ఎస్టీలతో ఇళ్ల నిర్మాణ పనులపై లబ్ధిదారులను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. బిల్లులు జాప్యం కాకుండా చూస్తానన్నారు.

వీఆర్‌ఓపై చర్యకు వినతి

తోట్లవల్లూరు: విజయవాడ సబ్‌కలెక్టర్, తోట్లవల్లూరు తహసీల్దార్ సంతకాల ఫోర్జరీకి పాల్పడి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసినట్లుగా రుజువైనందున యాకమూరు పూర్వపు వీఆర్‌ఓ బొప్పన గోపాలకృష్ణపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ కలెక్టర్ రంజిత్ బాషాకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మచిలీపట్నంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీ అందజేసినట్లు ఆయన తెలియజేశారు.

ఆరోగ్య హక్కు చట్టంపై నిరసన

గుడివాడటౌన్: ప్రైవేట్ వైద్యుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పొలడుగు వెంకట్రావు, డాక్టర్ పీఎస్‌ఆర్‌కే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లోపభూయిష్టమైన చట్టం తీసుకురావడంతో పాటు రాజస్థాన్ రాష్ట్రంలో అమలులోకి తేవడం దురదృష్టకరమన్నారు. దీని కారణంగా ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజలందరికీ ఉచితంగా వైద్యం చేయవలసి వస్తుందన్నారు. ఇది ప్రైవేట్ వైద్యం చేసేవారికి తీవ్రనష్టం కలిగిస్తుందని దీనిని వ్యతిరేకిస్తూ సోమవారం ఐఎంఏ సభ్యులంతా నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని ఓపీ నిర్వహించామన్నారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు పంపించామన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

మొవ్వ: క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో భాగంగా సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా వచ్చిన డెప్యూటీ తహసీల్దార్ వై.సుజాత, ఫిజికల్ డైరెక్టర్ టీఎస్ఎస్ దేవిలకు ఫిజిక్స్ పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని కాపీ రాస్తూ పట్టుబడింది. ఆమెపై మాస్ కాపీయింగ్ కేసు బుక్ చేసినట్లు సీఎస్ కె.కిరణ్ కుమార్, డీవో ఎల్.హిరణ్మయిలు తెలిపారు.

నేడు కుట్టుమిషన్ల పంపిణీ

గుడ్లవల్లేరు: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తలపెట్టిన మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమం పూర్తయ్యింది. శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్ర కల్యాణ మండపంలో కుట్టు మిషన్లను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానితో పాటు చైర్‌పర్సన్ హారిక చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వి.దిలీప్‌కుమార్ సోమవారం తెలిపారు.